

2 గంటల్లోనే ముంబయికి.. మధురపూడి నుంచి ఎయిర్‌బస్ ప్రారంభం 7



ముమ్మిడివరంలో నేలకొరిగిన వర్షపు నీట నానుతున్న వరి చేలు



గంగలకుర్రులో ధాన్యంపై బరకం కప్పుతున్న రైతు

# చినుకు... వణుకు

## అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లిన 'ఫెంగల్'

అంబాజీపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు ప్రకృతి విపత్తులతో పోరాటం చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాను కారణంగా గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో కొద్దిపాటి చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతులు పంటను కాపాడుకోవడానికి కూలీల ఖర్చు కాస్త ఎక్కువైనా వెనుకాడకుండా కుప్పలు వేయించారు. రహదారికి సమీపంలో పొలాలున్న రైతుల కోసం పనలను ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతానికి చేర వేస్తున్నారు. ఇదిలా ఉంటే తుఫాను కారణంగా ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి పంట చేలలో వర్షపు నీరు చేరింది. ఈదురుగాలులకు వరి చేలు నేలనంటాయి. ధాన్యం తడవకుండా రాశులపై టార్పాలిన్లు కప్పి రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు.



అంబాజీపేట మండలం కె.పెదపూడిలో వరి పనలను గట్టుకు చేరుస్తున్న కూలీలు

## అలల ఉధృతికి ఆక్వా గట్లకు గండ్లు

అల్లవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో మండలంలోని ఓడలరేవు సముద్ర తీరంలో అలల ధాటికి సీఆర్‌జెడ్ పరిధిలోని ఆక్వా చెరువుల గట్లు కొట్టుకు పోయాయి. అనధికార ఆక్వా చెరువులను అధికారులు తొలగించకపోయినా ప్రకృతి కన్నెర్రతో కెరటాల ఉధృతికి గట్లు కొట్టుకు పోయి గండ్లుపడ్డాయి. తీరంలో ఇసుక తవ్వకాలు, చెరువుల తవ్వకాలు మరింత ప్రమాదానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. తీరంలో అలల తీవ్రత కొనసాగుతోంది. సముద్రం రోజురోజుకూ ముందుకు చొచ్చుకొస్తోంది. ఎస్.రామేశ్వరంలో తెప్పల బోట్ల ద్వారా, ఓడలరేవు మొగ ద్వారా సముద్ర జలాల్లో జరిగే చేపల వేట ఆరు రోజులుగా నిలిచిపోయింది. జిల్లా అధికారుల ఆదేశాలతో ఓడలరేవు వైనతేయ తీరం వద్ద జెట్టీలో లంగర్లు వేసి బోట్లు నిలిపివేశారు. సముద్ర తీరంలో కోత నివారణకు గ్రోయిన్లు, జియోట్యూబ్ విధానంలో రాళ్లతో రక్షణ చర్యలు చేపట్టకపోతే ఓఎన్జీసీ టెర్మినల్స్‌కు, ఓడల రేవుకు ముప్పుతప్పదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



ఓడలరేవు జెట్టీ వద్ద నిలిచిన చేపల బోట్లు

## వర్షం, పెనుగాలులకు నేలనంటిన వరి చేలు

ముమ్మిడివరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు, పెనుగాలులకు వరి చేలు నేలనంటుతున్నాయి. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో 1,57,812 ఎకరాల్లో వరి సాగు కాగా ఇప్పటివరకు 98,004 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. 59,808 ఎకరాల్లో చేలు పక్వదశకు చేరుకుని కోతకు సిద్ధంగా ఉన్నాయి. శుక్రవారం నుంచి కురుస్తున్న వర్షాలు, గాలులకు వరి చేలునేలనంటుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలకొరిగిన వరి చేలు మిషన్ ద్వారా కోయడానికి పనికి రావని, మనుషులతో కోస్తే ఖర్చులు ఎక్కువవుతాయని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటివరకు మాసూలైన వరి చేలకు సంబంధించి జిల్లాలో రైతుల వద్ద లక్షా 36వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. ఇదంతా చేలల్లోను, మెరక మీద రాశుల రూపంలో ఉంది. ఆ ధాన్యం బయటకు వచ్చే మార్గం లేక వర్షాలు ఎప్పుడు తగ్గుతాయా అని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. ఆ ధాన్యాన్ని ఎండబెట్టుకోకపోతే రంగుమారే ప్రమాదం ఉంది.

కాగా ఖరీఫ్ రైతుల ఆశలపై ఫెంగల్ తుఫాను నీళ్ల చల్లింది. ఈ ఏడాది వాతావరణ మార్పుల కారణంగా వరి పంట అంతగా దిగుబడి ఇవ్వలేదు. దీనికి తోడు పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు పడడంతో మరింత నష్టాలకు గురిచేసింది. ప్రభుత్వం నిబంధనలు సడలించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. కళ్లాల్లో ధాన్యం రాశుల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోయింది. ఆకాశం తెరిపిస్తే ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకుందామని రైతులు ఎదురు చూస్తున్నారు. వాతావరణం మరో రెండు రోజులు ఇలాగే వుంటే ఖరీఫ్ రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది.

## కాట్రేనికోనలో మండలంలో అత్యధికంగా 110.2 మిల్లీమీటర్ల వర్షపాతం

అమలాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా ఆదివారం జిల్లాలో సగటున 40.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాట్రేనికోన మండలంలో అత్యధికంగా 110.2 మి.మీ., ఆత్రేయపురం మండలంలో అత్యల్పంగా 2.6 మి.మీ. వర్షం కురిసింది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో) ఇలా వున్నాయి. మండపేట 4.2, రాయవరం 6.2, రామచంద్రపురం 14.4, ఆలమూరు 10.6, రావులపాలెం 14.8, కొత్తపేట 36.8, కపిలేశ్వరపురం 21.2, కె.గంగవరం 28.2, ఐ.పోలవరం 72.6, ముమ్మిడివరం 64.2, అయినవిల్లి 64.2, పి.గన్నవరం 25.4, అంబాజీపేట 66.8, మామిడికుదురు 40.4, రాజోలు 34.8, మలికిపురం 48.6, సఖినేటిపల్లి 32, అల్లవరం 46.4, ఉప్పలగుప్తం 74.2, అమలాపురం 64.2.

## తేమ శాతం ఎక్కువున్నా ధాన్యం కొనాలి

### ధర తగ్గించవద్దు: మిల్లర్లకు జాయింట్ కలెక్టర్ నిషాంతి సూచన



అమలాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా తేమ శాతం ఎక్కువ వున్నా ధరను తగ్గించకుండా రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మిల్లర్లకు సూచించారు. ఆదివారం ఆమె జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులకు టెలికాన్ఫరెన్సు ద్వారా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా పంట చేతికి అందే సమయంలో నష్టపోకుండా అప్రమత్తంగా ఉంటూ పంటను కాపాడుకోవాలన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా టార్పాలిన్లు సరఫరా చేస్తున్నామన్నారు. వ్యవసాయాధికారులు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేస్తూ ధాన్యాన్ని మిల్లులకు తరలించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మండల స్థాయిలోనూ అదనంగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. రామచంద్రపురం డివిజన్‌లో మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లో పంట ఎక్కువ ఉన్న నేపథ్యంలో నూర్పిళ్లు పూర్తయి బయట ఉన్న ధాన్యం సేకరణ, మిల్లుల వద్ద జాప్యాలకు తావు లేకుండా అన్‌లోడింగ్ నిర్వహించాలన్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా డ్రోన్లు ఏర్పాటుచేసి కంట్రోల్ రూములకు డ్రోన్ సర్వేను అనుసంధానిస్తూ క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నాని జేసీ చెప్పారు.







ఎయిడ్స్ నివారణకు కృషి చేసినందుకు మెమెంటో అందజేస్తున్న డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్, ఏరియా ఆసుపత్రి వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో దుర్గారావుదొర

# 'ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు'

అమలాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. హెచ్ఐవీ ఉన్నవారితో కలిసి తినడం, మాట్లాడడం, వారి దుస్తులు ధరించడం వల్ల వైరస్ వ్యాప్తి చెందదని తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. 'సరైన మార్గం ఎంచుకోండి.. నా ఆరోగ్యం-నా హక్కు' థీమ్‌తో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీడీ శివశంకరప్రసాద్ మాట్లాడుతూ వైద్య రంగంలో వచ్చిన మార్పుల కారణంగా ఎయిడ్స్ వ్యాధి సాధారణ వ్యాధిగా మారిపోయిందన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగ్గిందన్నారు. దేశంలో హెచ్ఐవీ కేసులు ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా ఉండగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అధికంగా ఉన్నాయని వివరించారు. మందులు వాడుతూ సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఎక్కువ కాలం జీవించవచ్చన్నారు.

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర మాట్లాడుతూ ప్రతిఏటా డిసెంబరు 1న అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఎయిడ్స్‌కు చికిత్స లేదు మరణమే అన్న స్థాయి నుంచి వైద్య రంగంలో సాధించిన పురోగతితో సాధారణ వ్యాధిగా మారిపోయిందన్నారు. యాంటీ రిట్రో వైరల్ చికిత్సలు, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే తల్లి నుంచిబిడ్డలకు హెచ్ఐవీ వైరస్ సోకే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. జిల్లాలో ఈ ఏడాది 28,260 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించగా 178 మందికి పాజిటివ్ వచ్చిందన్నారు. గర్భిణుల్లో ఆరుగురికి పాజిటివ్ వచ్చిందని వివరించారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి కలిగిన 6,713 మంది ఏఆర్టీ మందులు ఉపయోగిస్తున్నారని, ప్రతినెలా 1,677 మందివ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పెన్షన్ అందజేస్తున్నామన్నారు. జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధిత చిన్నారులు, వ్యక్తులతో కలిసి అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు అల్పాహారం స్వీకరించారు. ఎయిడ్స్ నివారణకు కృషి చేస్తున్న పలువురికి మెమెంటోలు అందజేసి సత్కరించారు. అనంతరం అమలాపురం ఏరియా ఆసుపత్రి వద్ద ర్యాలీని ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించగా గడియార స్తంభం సెంటరు వరకు కొనసాగింది. అక్కడ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, కలెక్టరేట్ ఏవో కడలి కాశీవిశ్వేశ్వరరావు, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, డాక్టర్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

### డివిజన్, మండల స్థాయిల్లో కూడా

అమలాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక గ్రీవెన్స్ సోమవారం ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయితో పాటు డివిజన్, మండల స్థాయిల్లో కూడా గ్రీవెన్స్ జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.



అంతర్వేది వశిష్ఠ గోదావరి వద్ద గంగమ్మకు పూజ చేస్తున్న మత్స్యకారులు

## గంగమ్మా... ...కాపాడమ్మా!

అంతర్వేది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్ వశిష్ఠ రేవులో మత్స్యకారులంతా కలిసి ఆదివారం గంగమ్మ పండుగ జరుపుకున్నారు. నిత్యం గోదావరి, సముద్రాలపై వేట చేసుకునే తామంతా ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

# వెరీ..గుడ్డు



**కోడి గుడ్డు అధరహో**

**ఫారం వద్ద గుడ్డు రూ.6.08 పైసలు**

**రిటైల్‌గా రూ.7లకు విక్రయం**

అనపర్తి/సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దాణా రేట్లు, నిర్వహణా ఖర్చులు గణనీయంగా పెరగడంతో రెండేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో నడిచింది. ప్రస్తుతం గుడ్డు ధర రూ.6.08 పైసలకు పెరగడంతో రైతులు కొంత మేర ఊపిరి పీల్చుకుంటున్నారు. 15 నుంచి 20 రోజులుగా ఈ ధర అటు ఇటుగా ఉన్నప్పటికీ రైతుకు కొంత మేర ప్రయోజనం చేకూరుతోంది. గోదావరి జిల్లాల్లో పెద్ద చిన్న ఫారాలు సుమారుగా 300నుంచి 350 వరకు ఉన్నాయి. వీటిలో సుమారుగా 1.5 కోట్ల కోళ్లు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సుమారు 1 కోటి వరకు ఉత్పత్తి అవుతుండగా వీటిలో 40 శాతం వరకు స్థానిక అవసరాలకు వినియోగిస్తుండగా మిగిలిన వాటిని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. నెక్ ధర రూ.6.08పైసలు ఉన్నప్పటికీ ట్రేడర్లు మాత్రం ఈ ధరకు రూ.0.25 పైసలు తగ్గించి కొంటున్నారు. మరో 2శాతం కమిషన్ రూపంలో పోవడంతో రైతుకు 5.80పైసలు మాత్రమే అందుతుంది. అయితే పేపర్ రేటు ఎక్కువగా ఉండడంతో రిటైల్ మార్కెట్‌లో వినియోగదారుడు మాత్రం రూ.7 వెచ్చించి గుడ్డును కొనుగోలు చేస్తున్నాడు. అయితే దేశం మొత్తం పంజాబ్ మార్కెట్‌పై ఆధారపడి ఉంటుందని, అక్కడ ధర ఉన్నంత వరకే ఇక్కడ ధర ఉంటుందని, ఎన్ని రోజుల పాటు ఈ ధర నిలబడుతుంతో చెప్పలేమని రైతులు చెబుతున్నారు. రెండు మూడేళ్లలో బ్యాచ్‌ల సంఖ్య గణనీయంగా తగ్గించడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఉత్పత్తి కూడా తగ్గు ముఖం పట్టింది. గుడ్డు తయారీకి సుమారుగా రూ.5 వరకు ఖర్చు అవుతుందని, అయితే ఏడాదిలో కనీసం రెండు మూడు నెలలు కూడా గిట్టుబాటు ధర ఉండడం లేదని, మిగిలిన తొమ్మిది మాసాల్లో నష్టాలు చవిచూస్తున్నామని రైతులు అంటున్నారు. దీనికి తోడు నూకలు, మొక్కజొన్నలు దొరడంలేదని, దొరికినా కొనలేని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా రైతులకు అనేక రాయితీలు అందేవని, ఐదేళ్లుగా వైసీపీ పాలనలో ఒక్క రాయితీ కూడా లేకుండా చేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కనీసం నూకలు, మొక్కజొన్న రాయితీ ధరకు అందిస్తే పరిశ్రమ మనుగడ సాగిస్తుందని రైతులు కోరుతున్నారు.

# సత్యదేవుడి వ్రతాలు 1,47,122

● ఆల్ టైమ్ రికార్డు ● ముగిసిన కార్తీక సందడి ● నేడు హుండీల లెక్కింపు ● రూ.20 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా



ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హరిహరులకు ప్రీతికరమైన పవిత్ర కార్తీకమాసం సందడి హరిహర క్షేత్రమైన సత్యదేవుడి ఆలయంలో ఆదివారంతో ముగిసింది. కార్తీకమాసం నెలరోజుల్లో ప్రతీఏటా 15 రోజులు పర్వదినాలు మిగిలిన 15రోజులు సాధారణ రోజులుగా ఉండేవి. ఈ ఏడాది మాత్రం కార్తీకమాసం ప్రారంభం నుంచి రద్దీ నాలుగైదు రోజులు మినహా ఒకే విధంగా సాగింది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా వ్రతాల సంఖ్య ఆల్ టైం రికార్డు నెలకొల్పి 1,47,122 వ్రతాలు జరిగాయి. వీటిలో రూ.300 వ్రతాలు 1,6,901, రూ.1000 వ్రతాలు 17,714, రూ.1500 వ్రతాలు 10,269, రూ.2000 వ్రతాలు 12,238 జరిగాయి. ఈ ఏడాది కార్తీకమాసంలో భక్తులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అలయ అధికారులు చర్యలు తీసుకోవడంతో త్వరితగతిన వ్రతాలు, దర్శనాలు పూర్తిచేసుకోగలిగారు. ప్రధానంగా ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు కలగనివ్వలేదు. గిరి ప్రదక్షిణ మధ్యాహ్నం సత్యరథంతో ప్రారంభించడం సత్ఫలితాలు ఇచ్చింది. పడమట రాజగోపురం వద్ద కంపార్టమెంట్లు ఏర్పాటు, క్యూలైన్‌లు పొడిగించడంతో సాధ్యమైంది. ఈ ఏడాది కార్తీకమాసంలో అన్ని విభాగాల ద్వారా సుమారు రూ.20 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. సోమవారం జరిగే హుండీల లెక్కింపుతో లెక్కతేలిపోనుంది. ఒక్క వ్రతాల ద్వారా సుమారు రూ.8కోట్లు ఆదాయం రావొచ్చని అంచనా. కౌంటర్లలో 143708 వ్రతం టిక్కెట్లు విక్రయించగా ఆన్‌లైన్ ద్వారా 3414 టిక్కెట్లను భక్తులు బుకింగ్ చేసుకున్నారు. వ్రత పురోహితులు, సిబ్బంది సముష్టిగా కృషి చేశారు.

**మంత్రి సుభాష్ పూజలు**

రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



సత్యదేవుని దర్శనానంతరం మంత్రి సుభాష్

## విఘ్నేశ్వరస్వామి ఆదాయం రూ.83.77 లక్షలు



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారి దేవస్థానం పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గతేడాది కంటే అధిక ఆదాయం పొందినట్టు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆదివారం తెలిపారు. గత నెల 2వ తేదీ నుంచి డిసెంబరు 1 వరకు సిద్ధివినాయస్వామివారిని 2.76లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని, 1.26లక్షల మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. గతేడాది రూ.46,13,318 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.83,77,303 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. గత కార్తీకమాసానికంటే అదనంగా రూ.37,63,985 అధిక ఆదాయం లభించిందన్నారు. అమలాపురం పట్టణానికి చెందిన దువ్వూరి లక్ష్మీఉదయ, శ్రీరామ భాస్కరకుమారి కుటుంబ సభ్యులు స్వామిని దర్శించుకుని విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.16,816 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేసి దాతలను శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటంఅందజేశారు.

# 2 గంటల్లో ముంబై

**రాజమహేంద్రవరం టూ ముంబైకి ఎయిర్‌బస్**

**ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్**




విమాన సర్వీసును ప్రారంభించి కేక్ కట్ చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేవలం రెండు గంటల్లోనే రాజమహేంద్రవరం నుంచి ముంబైకి వెళ్లవచ్చని రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం (మధురపూడి) విమానాశ్రయం నుంచి ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు తొలిసారిగా ముంబైకి నేరుగా విమాన సర్వీసును ప్రారంభించి మాట్లాడారు. ఎయిర్ బస్సు సర్వీసుతో రాజమహేంద్రవరం, ముంబైకి మధ్య దూరం తగ్గిందన్నారు. ఈ నెల 12 నుంచి న్యూఢిల్లీకి ఇక్కడ నుంచి విమాన సర్వీసు ఆరంభమవుతుందన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహనాయుడు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పట్టుదలతో ఎయిర్‌బస్ సర్వీసును వేశారన్నారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం 4.50 గంటలకు ముంబై నుంచి బయలుదేరి రాజ మహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు 6.45 గంటలకు చేరుతుందన్నారు. ఈ ఎయిర్‌బస్సు రాత్రి 7.15 గంటలకు ఇక్కడ నుంచి తిరిగి బయలుదేరి రాత్రి 9.05 గంటలకు ముంబై చేరుకుంటుందని చెప్పారు. తొలిరోజు అరగంట ఆలస్యంగా ఎయిర్‌బస్ వచ్చినట్టు చెప్పారు. ముంబై, రాజమహేంద్రవరం మధ్య కేవలం గంట 50 నిమిషాల ప్రయాణం ఉంటుందన్నారు. తొలిరోజు ముంబై నుంచి 172 మందితో రాజమహేంద్రవరం వచ్చిందని చెప్పారు. తిరిగి ఈ ఎయిర్‌బస్సులో 120 మంది ముంబై వెళ్లారని తెలిపారు. ఈనెల 12వ తేదీ నుంచి రాజమహేంద్రవరం నుంచి నేరుగా న్యూఢిల్లీకి ఇండిగో విమాన సర్వీసు ఆరంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, బీజేపీ నేతలు నీరుకొండ వీరన్నచౌదరి, జవ్వాది లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

# మహాకుంభాభిషేక మహోత్సవం

**కత్తిపూడిలో విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామికి అభిషేకం**

శంఖవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో కత్తిపూడి విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామివారి మహాకుంభాభిషేక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామమంతా శివ పంచాక్షరీనామంతో మార్మోగింది. పరసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది భక్తులతో, సువాసినీ మహిళలతో నిర్వహించిన కార్యక్రమం కనుల పండువగా జరిగింది. కార్తీకమాస అమావాస్య పర్వదినాన సప్తనదీ జలాలతో పురవీధుల్లో తిరిగి పరమశివుడికి అభిషేకం చేశారు. వేలాదిమంది సువాసినీ మహిళలు కలశాలతో గ్రామపుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి అనంతరం స్వామి,అమ్మవార్లకు ఏకకాలంలో అభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ పూజారి ర్యాలీ సుబ్రహ్మణ్యకుమార్, ధర్మకర్త మంచాల సత్యనారాయణ ఆధ్వర్యంలో పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేక అనంతరం మహా అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది పాల్గొన్నారు.



కత్తిపూడిలో కలశాలతో వేలాదిగా తరలివస్తున్న భక్తులు



ఆలయ శిఖరానికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

## బాలబాలాజీ ఆదాయం రూ.57.45 లక్షలు



అప్పనపల్లి బాలబాలాజీస్వామి

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి కార్తీకమాసం నెల రోజుల ఆదాయం రూ.57,45,465 వచ్చినట్టు సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. నెలరోజుల పాటు స్వామివారిని 2,28,360 మంది దర్శించుకున్నారని, వారిలో 1,01,280 మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు తెలిపారు. గత సంవత్సరం కార్తీకమాసంలో స్వామివారికి ఒక నెలకు రూ.30,25,266 ఆదాయం వచ్చిందని, గతేడాది కంటే ఈ సంవత్సరం ఆదాయం రూ.27,27,199 అధికంగా వచ్చినట్టు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామని, సహకరించిన సిబ్బంది,నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉప్పాడ తీరంలో అలల ఉధృతి

**బీచ్‌రోడ్డును తాకుతున్న కెరటాలు**



ఉప్పాడ బీచ్‌రోడ్డు పైకి ఎగసిపడుతున్న కెరటాలు

కొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో ఆదివారం కూడా కెరటాల ఉధృతి కొనసాగుతూనే ఉంది. సాధారణ స్థాయి కంటే 2 నుంచి 3 మీటర్ల ఎత్తులో ఎగసిపడిన రాకాసి అలలు ఉప్పాడ-నేమాం మధ్య బీచ్‌రోడ్డుపైకి దూసుకొస్తున్నాయి. సుబ్బంపేట, కొత్తపట్నం, విద్యుత్ ప్లాంటు ప్రాంతాల్లో కెరటాలు ఉవ్వెత్తున గాలిలో లేస్తూ బీచ్‌రోడ్డును బలంగా తాకుతున్నాయి. దీంతో రోడ్డుకు అడుగు భాగంలో ఉన్న కంకర రాళ్లు రోడ్డుపైకి విసిరేసినట్టు ఎగిరిపడుతున్నాయి. పెద్ద వంతెన సమీపంలో నిర్మించిన అప్రోచ్ వంతెన రోడ్డుపై సముద్ర కెరటాలు విరుచుకుపడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో బీచ్‌రోడ్డులో రాకపోకలను నియంత్రించేందుకు స్థానిక పోలీసులు చర్యలు చేపట్టారు.

# ఘనంగా అఖండ కోటి దీపారాధన



సామర్లకోట భీమేశ్వరాలయంలో దీపాలను వెలిగించిన దృశ్యం

సామర్లకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపు పురస్కరించుకుని కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం రాత్రి అఖండ కోటిదీపారాధన పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీకదీపారాధన సేవాసంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణ అంతటా చమురు వత్తుల ప్రమిదలతో కూడిన దీపాలను అలంకరించారు. గణపతికి ముందుగా పూజలు నిర్వహించి పండితులచే గంట మోగించగా వందలాది భక్తులు దీపాలను ఒకేసారి వెలిగించడంతో ఆలయ ఆవరణ దీపపు కాంతులతో దేదీప్యమానంగా మారింది. వర్షం కురుస్తున్నా ఏమాత్రం లెక్కించకుండా అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**పోలిపాడ్యమి అంటే..**

కార్తీకమాసంలో వచ్చే చివరి రోజును పోలి స్వర్గం అని అంటారు. డిసెంబరు 1తో కార్తీకం ముగిసింది. మరుసటి రోజును పోలి పాడ్యమి అంటారని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయ అభిషేక పండిట్ వేమూరి సోమేశ్వరశర్మ వెల్లడించారు. దీనితర్వాత రోజు నుంచే మార్గశిరం మాసం ప్రారంభం అవుతుంది. పోలిపాడ్యమి రోజున భక్తులు శివాలయాల్లో పూజలు చేస్తారు. ఈ రోజున 30 వత్తులతో దీపాలను వెలిగించడం ప్రత్యేకత.

# ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన!

**అక్రమాలకు పాల్పడిన రంపచోడవరం గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ**

**ఉన్నతాధికారులకు తెలియకుండా 14 మంది సిబ్బందికి డిప్యుటేషన్లు**

**ఎన్నికల సంఘం, ఉన్నతాధికారులకు ఆదివాసీ సంఘం ఫిర్యాదులు**

రంపచోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ ఒకరు అక్రమాలకు పాల్పడి 14 మంది సిబ్బందిని డిప్యుటేషన్లపై బదిలీ చేస్తూ వివాదస్పద ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బాగోతాన్ని ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం వెలుగులోకి తెచ్చి ఎన్నికల సంఘానికి, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ ఆ సమాచారాన్ని మీడియాకు తెలిపారు. ఈ బాగోతం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయానికి అనుబంధంగా నడుస్తోంది. ఈ డిప్యూటీ డైరెక్టర్ పోస్టు గత కొన్నేళ్లుగా ఇన్‌చార్జిలతోనే నడుస్తోంది. ఇటీవల ఈ పోస్టుకు వేరే అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. సదరు అధికారి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నుంచి ఎటువంటి ఆమోదాలు తీసుకోకుండానే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే తన కార్యాలయం నుంచి డిప్యుటేషన్లపై బదిలీలు చేపట్టారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు ఆయా అధికారులకు, కార్యాలయం సిబ్బందికి ముట్టాయని ఆదివాసీ సాంస్కృతిక సంఘం నాయకులు కత్తుల ఆదిరెడ్డి, తాడే రాజబాబు ఆరోపించారు. తక్షణం సదరు అధికారిని డీడీ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఎన్నికల సంఘం, ఎన్నికల ఉన్నతాధికారులు అధికారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# కన్నబాబు.. అప్పుడు నోరు పెగల్లేదేమి?

**ఇప్పుడు రేషన్ బియ్యం అవినీతిపై ఉలికిపాటెందుకు**

**కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు మండిపాటు**



ఎమ్మెల్యే కొండబాబు


కాకినాడ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడ పోర్టు నుంచి లక్షల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా ఎగుమతి అయినా వైసీపీ నేతల నోళ్లు పెగల్లేదని, కళ్లముందే వందల కోట్ల రూపాయల బియ్యం ద్వారంపూడి తరలించినా మంత్రి హోదాలో కన్నబాబు కళ్లప్పగించి చూశారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మండిపడ్డారు. కాకినాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అప్పుడు ద్వారంపూడికి భయపడి కన్నబాబు నోరు మెదపలేదన్నారు. బియ్యం ఎగుమతిలో వైసీపీ నేతలు ఉండడం వల్లే ప్రశ్నిస్తే మంత్రి పదవి పోతుందని కళ్లప్పగించి చూశారన్నారు. గడచిన ఐదేళ్లలో పోర్టులో రేషన్ బియ్యం అక్రమ ఎగుమతిపై తాను పోరాడానన్నారు. ఈ బియ్యాన్ని తనిఖీ చేసేందుకు పోర్టు లోపలికి వెళ్తే తమపై అక్రమ కేసులు పెట్టించారని, తప్పులు చేయకపోతే తమపై అక్రమ కేసులు ఎందుకు పెడతారని అన్నారు. కాకినాడ టీడీపీ కార్యాలయంపై దాడికి ఎందుకు దిగారని, ఆ రోజు కన్నబాబు నోరు ఎందుకు పెగల్లేదన్నా రు. ద్వారంపూడి ఐవరీ కోస్టుకు వెళ్లి బియ్యం గొడౌన్‌లు కట్టించాడని తాను ఆధారాలతో సహా బయటపెట్టానన్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ ఎగుమతిపై ఉక్కుపాదం మోపుతుంటే పెడబొబ్బలు పెడుతున్నారని కొండబాబు అన్నారు.

# దుబాయ్‌లో పేరవరం వాసి అనుమానాస్పద మృతి

**పది రోజుల క్రితమే మృతి**

**మంత్రులు లోకేశ్, నిమ్మల సహకారంతో నేడు స్వగ్రామానికి మృతదేహం**

**కన్నీరుమున్నీరవుతున్న బంధువులు**



రమేష్(ఫైల్)

ఆత్రేయపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందాడు. పదిరోజులు కావొస్తున్నా మృతదేహం ఇంటికి రాకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు వేదన చెందుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన అంగర రమేష్(35) దుబాయ్‌లోని డేరా ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. ఏడాదిన్నర క్రితం వెళ్లి ఉద్యోగంలో చేరినా మధ్యలో స్వగ్రామం వచ్చి 6 నెలల క్రితమే తిరిగి వెళ్లాడు. రమేష్‌కు భార్య కవితాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అక్కడ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.ఇదిలా ఉండగా గత నెల 15న అనుమానాస్పదంగా మృతిచెందాడు.అక్కడ మిత్రులు కుటుంబీకులకు సమాచారం అందించారు. అయితే మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించడంలో జాప్యం జరుగుతోంది. రమేష్ మృతిపై అక్కడ ప్రభుత్వం విచారణలో తేల్చాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రమేష్ భార్య కవిత బంధువులు ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి లోకేశ్‌కు విషయాన్ని వివరించారు.అక్కడ ప్రతినిధులతో మాట్లా డి మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించే చర్యలు వేగవంతం చేశారు. దుబాయ్ నుంచి విమానంలో మృతదేహాన్ని గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చే ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువస్తున్నట్టు సమాచారం.రమేష్ మృతితో పేరవరం గౌడపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధు మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## పాపికొండలకు పోటెత్తిన పర్యాటకులు



పేరంటాలపల్లిలో పర్యాటకుల సందడి

దేవీపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఆదివారం వెళ్లారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండల పరిధిలోని పోశమ్మగండి బోట్ పాయింట్ నుంచి గోదావరి పరివాహక ముంపు ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, గొందూరు, కచ్చులూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లి ఆ గ్రామంలో శివున్ని దర్శించుకుని సందడి చేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మఅమ్మవారిని దర్శించుకుని అనంతరం ఆరు బోట్లలో 450 మంది పర్యాటకులు పాపికొండలు వెళ్లారు. గోదావరి వరదల అనంతరం గండిపోశమ్మ అమ్మవారి దర్శనం పునఃప్రారంభించగా రెండో ఆదివారం దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

## సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు 13 మంది ఎంపిక

రాజమహేంద్రవరం సిటీ డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్షల్లో 13 మంది అభ్యర్థులు అర్హత సాధించారని బీసీ సడీ సర్కిల్ సంచాలకులు కెఎస్.జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సివిల్ సర్వీస్ ఉచిత కోచింగ్‌కు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 70 మంది హాజరు కాగా 13 మంది అర్హత సాధించారన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో 6నెలల పాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని, ఉచిత సివిల్ కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 'రేషన్ బియ్యం అక్రమాల్లో నా పాత్ర లేదు'

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు ప్రచారం చేస్తున్నారని, ఎక్కడా తన కోసం ఆయన తప్పుగా మాట్లాడలేదని శాన్‌మెరైన్ సంస్థ అధినేత అలీషా ఆదివారం ఒక ప్రకటన వెలువరించారు. రేషన్ బియ్యం అక్రమాల్లో తన పాత్ర ఎక్కడా లేదన్నారు. తనిఖీల్లో భాగంగా పవన్ కేవలం అలీషా ఎవరని అడిగారన్నారు. పోర్టులో బియ్యం ఎగుమతి, దిగుమతులతో తనకు సంబంధం లేదని, తనకు ఉన్న ఏకైక వ్యాపారం నౌకలను తయారు చేయడం మాత్రమేనన్నారు. రేషన్ అక్రమ రవాణాలో ఏ భాగస్వామ్యంలేదని తెలిపారు.

# వాన.. వల!



యానాం గౌతమీ గోదావరి పుష్కర ఘాట్ వద్ద ఆదివారం వర్షంలో కూడా ఓ మత్స్యకారుడు చేపల కోసం వల వేస్తూ ఇలా కనిపించాడు

-యానాం

### భక్తిశ్రద్ధలతో చండీహోమం

ఆలమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా ఆదివారం చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయం వద్ద చండీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజు పర్యవేక్షణలో చండీహోమాన్ని పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు.

### ఉచిత శిక్షణా తరగతులు

ఆత్రేయపురం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ర్యాలిలో విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అనూష్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నవోదయాకు ఎంట్రన్స్‌కు వెళ్లే విద్యార్థులకు శిక్షణ తరగతులను మనసత్వ వేత్త చింతా శ్యామ్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్స్ చిన్నారులకు శిక్షణ అందించారు.

# ఫెంగల్ తుఫాన్.. రైతులు కుదేలు

- గాలులకు నేలనంటిన వరి పైరు
- కళ్లాల్లో ధాన్యం



మామిడికుదురులో వరిచేలను ముంచిన వర్షపునీరు, కాట్రేనికోన: ఓల్డ్ అయినాపురం డ్రెయిన్‌లో వలకట్లు

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో శనివారం నుంచి కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మామిడికుదురు నుంచి నగరం వరకు జాతీయ రహదారి వర్షం నీటిలో మునగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై రెండు అడుగుల మేర నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షాలకు వరిచేలు నేలనంటాయి. పంటచేతికి వచ్చే సమయంలో తుఫాన్ తమ నడ్డి విరిచిందని సార్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలాగే కురిస్తే అపారనష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలనంటిన పంట ఎందుకూ పనికిరాకుండా పోతుందని, ధాన్యం మొలకెత్తే అవకాశం ఉంటుందని అంటున్నారు. సారా నారుమడులు సమయంలో అప్పుడు వర్షాలు వల్ల నష్టాలు చవి చూశామని, తిరిగి మరలా పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో తీవ్రనష్టం చూడాల్సి వస్తుందని రైతులు తెలియచేస్తున్నారు.

### స్తంభించిన డ్రెయిన్లు

కాట్రేనికోన, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను సార్వా రైతులను అతలాకుతలం చేసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. చేపల వేటకు అంతరాయంతో మత్స్యకార కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు ధాన్యం వివిధ స్థాయిల్లో తడిసి నానా ఇబ్బందులు పడుతున్నారు. చేలల్లో ఉన్న వరిపైరు వర్షాలకు నేలకొరిగింది. నేలనంటిన పైరును కొయ్యాలంటే వ్యయప్రయాసలతో కూడిన పనిగా రైతులు ఆందోళన చెందుతున్నారు. చేపల వల కట్ల కారణంగా ఓల్డ్‌అయినాపురం డ్రెయిన్‌లో ముంపునీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడింది. ఫలితంగా చేలల్లోని ముంపునీరు దిగే అవకాశం లేనందున వరిపైరు ఎన్ని రోజులు ముంపులో నానుతుందో తెలియక రైతులు భయపడుతున్నారు. ముంపునీరు తక్షణం దిగాలంటే వలకట్లు యుద్ధప్రాతిపదికన తొలగించాలని రైతులు కోరుతున్నారు.

### నీట మునిగిన వరి చేలు

రాజోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడలి, ములికిపల్లి, పొన్నమండ, తాటిపాక, శివకోడు, బి.సావరం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో 182 ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయని మండల వ్యవసాయశాఖ అధికారి వై.మధుకుమార్ ఆదివారం తెలిపారు. 2,976 ఎకరాల్లో వరి పంట వేశారని, 382 ఎకరాల్లో కోతలు కోశారని, 2594 ఎకరాల్లో కోయాల్సి ఉందన్నారు. వరి పంట చేతికి వచ్చే సమయంలో వర్షంతో రైతులు అవస్థలు పడుతున్నారు. తుఫాను కారణంగా పంటచేలకు నష్టం వాటిల్లుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

### నేలనంటిన వరి చేలు

అల్లవరం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీస్తున్న గాలులకు మండలంలోని దేవగుప్తం, అల్లవరం, యెంట్రుకోన, కోడూరుపాడు తదితర గ్రామాల్లో సార్వా వరి చేలు నేలకొరిగాయి. కోతకు వచ్చిన చేలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల ధాన్యం రాశులను బరకాలతో కప్పి రక్షణ చర్యలు చేపట్టారు.

### విస్తారంగా వర్షం

మలికిపురం,డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. దాళ్వా కోసం వేసిన నారుమడులు వర్షపు నీటిలో నానుతున్నాయి. జనజీవనం స్తంభించింది. కూలీలు పనులు లేక ఇబ్బందిపడుతున్నారు.

# ఆలయాలకు పోటెత్తిన భక్తులు




ఐ.పోలవరం: ప్రత్యేక అలంకరణలో మురమళ్ల వీరేశ్వరస్వామి, మురమళ్ల ఆలయంలో కార్తీక దీపోత్సవం, అంతర్వేది ఆలయంలో వేప చెట్టు వద్ద పూజలు

అంతర్వేది, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): అంతర్వేది గోదావరి, సముద్ర తీరాల్లో వేకువజాము నుంచే కార్తీకమాస ముగింపు దీపోత్సవాలు ఘనంగా జరిగాయి. క్షేత్రపాలకుడునీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. నందీశ్వరుని వద్ద భక్తులు దీపారాధన జరిపి పూజలు చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేప చెట్టు వద్ద ముడుపులు కట్టి కోర్కెలు కోరుతూ ఉదయం నుంచి భక్తులుదీపారాధనచేశారు. నిత్యాభిషేకం, సుదర్శనహోమాల్లో భక్తులు పాల్గొని నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు.

### ప్రత్యేక అలంకరణలో వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా మురమళ్లభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి కార్తీక దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ దంపతులు, దాట్ల రామకృష్ణంరాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు.

### ఏకాదశ రుద్రుల దర్శనం

అంబాజీపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగియడంతో ఆదివారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. దూరప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మండలంలోని ఏకాదశ రుద్రులను దర్శించుకున్నారు. ముక్కామల రామేశ్వరస్వామి ఆలయంలో మాస దీక్ష పరిపూర్ణత సందర్భంగా స్వామివారికి శాంతికల్యాణం నిర్వహించారు. ఈసందర్భంగా ఆల యంలో అభిషేకాలు, పూజలు చేపట్టారు.

### లక్ష్మణేశ్వరునికి లక్ష బిల్వార్చన

అల్లవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మణేశ్వరంలో పార్వతీ లక్ష్మణేశ్వరునికి ఆదివారం లక్ష బిల్వార్చనను ఘనంగా నిర్వహించారు. దొంతుకుర్తి రమేష్ బ్రహ్మత్వంలో సుందరకాండ పారాయణ, మహాలింగార్చన, కుంకుమ పూజలు జరిగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తుల శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

### లక్షపత్రి పూజ

కాట్రేనికోన, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన బ్రాహ్మణసేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీకనికేశ్వరస్వామికి లక్షపత్రి పూజ నిర్వహించారు. 14మంది రుత్విక్కులతో విఘ్నేశ్వర పూజ, మహాన్యస పారాయణ, విశేష ద్రవ్యాలతో శ్రీకనికేశ్వరస్వామికి అభిషేకాలు, లక్ష బిల్వార్చన ఉమాదేవికి కుంకుమార్చన నిర్వహించారు. బ్రాహ్మణ సత్కారం, అన్నసమారాధన జరిగింది.

### ఉసిరి చెట్టు వద్ద పూజలు

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని మామిడికుదురులో కార్తీక దామోదర పూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుండాబత్తుల సత్యనారాయణమూర్తి, శేషవేణి దంపతులు, కుటుంబ సభ్యులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్తీక వనసమారాధనలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

# సభ్యత్వాల నమోదులో ముందుండాలి


మాట్లాడుతున్న సీనియర్ నాయకుడు బులుసు జగదీష్

అమలాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ క్రియాశీలక సభ్యత్వాల నమోదులో జిల్లా ముందు స్థానంలో ఉండాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా పేర్కొన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అధ్యక్షతన ఆదివారం సభ్యత్వ నమోదు కార్యశాల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు ఈ నెల5వ తేదీలోగా బూత్ కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో 25 బూత్ కమిటీలను నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ స్థాయి నుంచి కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహనరావు, సీనియర్ నాయకుడు బులుసు జగదీష్ మాట్లాడుతూ ప్రతి బూత్‌లోనూ 25మంది సభ్యులు తక్కువ కాకుండా చూడాలన్నారు. సభ్యత్వ నమోదు ఆవశ్యకతను ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, అడబాల సత్యనారాయణ, యిళ్ల సత్యనారాయణ, జిల్లా ఏఆర్వోలు మాలే శ్రీనివాసనగేష్, సత్తి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోకా వెంకటసుబ్బారావు, గనిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కాళాబత్తుల చిన్నారి, చిట్టూరి రాజేశ్వరి, కొండేటి ఈశ్వర్‌గౌడ్, చికలమర్తి కస్తూరి, జగతా శాంతి తదితరులు పాల్గొన్నారు.

### రెడ్డిపల్లిలో మెగా వైద్య శిబిరం

అమలాపురం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెడ్డిపల్లిలో సర్పంచ్ కరాటం రత్నప్రసన్న-ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేవీఆర్ రీసెర్చ్ ఫౌండేషన్, శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ నరసింహరాజు, డాక్టర్ వై.అనంతలక్ష్మి, డాక్టర్ అభిషేక్‌వర్మ వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి ఉచితంగా మందులు అందజేశారు. 17మంది వైద్యులు సిబ్బందితో పాల్గొని 27రకాల వైద్యసేవలందించారు. కార్యదర్శి బొర్రా ఆదిశంకరం, మాజీ సర్పంచ్ కరాటం సూర్యభాస్కరరావు, కొలిశెట్టి జయప్రకాష్, నిమ్మకాయల రాంబాబు, రాజులపూడి భీముడు, నల్లా సతీష్, గుర్రం ధర్మరాజు, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు అండగా ఉండే వారినే నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉండి వ్యవసాయంపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తులకే నీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. రాజోలు నియోజకవర్గ పరిధిలో నీటి సంఘం ఎన్నికలపై మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కు వద్ద ఆదివారం ఏర్పాటుచేసిన ఎన్డీఏ కూటమి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయానికి ఉపయోగపడే సాగునీటి కాల్వలు, డ్రైనేజీలను పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేసిందన్నారు. రాబోయే రోజుల్లో రాజోలు నియోజకవర్గంలో వ్యవసాయానికి పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తామని, కాల్వలను, డ్రైనేజీలను పూర్తిగా బాగుచేసి వ్యవసాయానికి అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాజోలు నియోజకవర్గంలో ప్రాజెక్టు కమిటీ వచ్చేలా ఇప్పటికే తాను మిగిలిన ఎమ్మెల్యేలతో చర్చలు జరిపానని, రెండు డీసీలు, 11 నీటి సంఘాల్లోను కూటమి సభ్యులే విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, గుండుబోగుల పెద్దకాపు, అడబాల యుగంధర్,గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, చాగంటి స్వామి, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల ఫణికుమార్, ఎస్.శ్రీనివాస్, దొడ్డా జయరామ్, తాడి సత్యనారాయణ, ముదునూరి చినబాబు, భూపతిరాజు సాయిబాబు, గెడ్డం మహలక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి


హైందవ శంఖారావం గురించి మాట్లాడుతున్న హిందూ బంధువు

అంతర్వేది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి పాదాల చెంతన జరిగే హైందవ శంఖారావం-హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ హిందూ బంధువులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అంతర్వేది కొత్త ముత్యాలమ్మ ఆలయం వద్ద కేశవదాసుపాలెం సంఘ మండల గ్రామలైన శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం, అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాల హిందూ బంధువులందరూ కలిశారు. బెల్లంకొండ నాని, వార్డు సభ్యుడు బి.రాంబాబు, మెండు అంజి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### శివాలయల్లో ఘనంగా పూజలు

రావులపాలెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో నిర్వహించిన పూజలు ఘనంగా జరిగాయి. కార్తీక మాస పర్వదినాలలో ఆఖరిరోజు ఆదివారం వేకువజాము నుంచి ఆలయాల్లో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, బిల్వార్చన, తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# కుక్కల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు


అధికారులతో సమీక్షిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో కుక్కల బెడద నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. తన స్వగృహంలో ఆదివారం పరిపాలనాధికారి మునిస్వామి, పశువైద్యశాఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. యానాంలో మూడు వేలకుపైగా వీధి కుక్కలు ఉన్నాయని అధికారులు అంచనా వేశారు. వాటికి హాని కలగకుండా ప్రత్యేక షెడ్ వేసి ఆహారం ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వాటికి వేక్సిన్‌తో పాటు వాటి సంరక్షణ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అయితే ప్రతీ కుక్కకు వేక్సిన్, ఆపరేషన్ (పిల్లలుపుట్టకుండా) చేయించడానికి సుమారు రూ.1500 చొప్పున ఖర్చు అవుతుందని, మొత్తంగా రూ.45 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఈమొత్తం ఖర్చు మున్సిపాల్టీకి భారమవుతుందని, దాతలు ముందుకు రావాలని మల్లాడి కోరారు.

# అతిథులకు ఆహ్వానం పలికే భవనానికి విశ్రాంతి

- నిధుల కొరతతో నిలిచిన పనులు
- ప్రారంభానికి నోచుకోని భవనం


నిధులు కొరతతో నిలిచిపోయిన ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం

పి.గన్నవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) నిత్యం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కళకళలాడే విశ్రాంతి భవనం నేడు కళావిహీనంగా మారింది. భవన నిర్మాణం నిధుల కొరతతో అసంపూర్తిగా నిలిచిపోయింది. వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఐదేళ్లుగా భవన పరిసరాలు అధ్వానంగా మారాయి. ప్రారంభం కాకుండానే భవనం చుట్టూ పిచ్చి మొక్కలతో శిథిలమయ్యే పరిస్థితి నెలకొంది. భవనంపైకి గడ్డి తీగలు అల్లుకుపోవడంతో ఆప్రాంతం అస్త వ్యస్తంగా తయారైంది. పి.గన్నవరంలో నిర్మా ణంలో ఉన్న అర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం దుస్థితి ఇది. విశ్రాంతి భవనం పక్కనే ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ భవనం కూడా పూర్తిగా శిథిలమైంది. 2018లో టీడీపీ ప్రభుత్వం శిథిల భవనస్థానే నూతన విశ్రాంతి భవన నిర్మాణానికి రూ.25లక్షలు నిధులు మంజూరు చేయడంతో అప్పటి ఎమ్మెల్యే పులపర్తి నారాయణమూర్తి పనులు ప్రారంభించారు. భవవ నిర్మాణం పూర్తయినప్పటికి నిధుల కొరతతో భవనంలో ఎలక్ట్రికల్ పనులు, రంగులు, ఫర్నిచర్ పనులు నిలిచిపోయాయి. సంబంధిత పనులకు రు.15లక్షలు నుంచి రూ.20లక్షలు అవసరమని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం రావడంతో అధికారులు మిగిలిన పనులు నిమిత్తం ప్రభుత్వానికి అంచనాలు పంపించినా ఫలితం లేదు. ఐదేళ్లుగా విశ్రాంతి భవన నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కూటమి ప్రభుత్వంలో విశ్రాంతి భవనాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### నేటి నుంచి ఇంటింటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ


ఎస్టీయూ జిల్లాశాఖ నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్ కిశోర్‌బాబు

అమలాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి సోమవారం నుంచి ఇంటింటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తామని అమలాపురం తహశీల్దారు జీడీ కిశోర్‌బాబు పేర్కొన్నారు. ఉపాధ్యాయ, జిల్లా సంఘాల నాయకులతో ఆదివారం ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు పలు అంశాలను ప్రస్తావించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఓటరు జాబితా కొత్తది రావడం వల్ల సీరియల్ నంబర్లు మారినట్టు వివరించారు. ఎవరికైనా ఓటరు స్లిప్పు ఇంటికి అందకపోతే తహసీల్దారు కార్యాలయంలో పొందవచ్చన్నారు. ఓటరు స్లిప్పు లేకపోయినా జాబితాలో పేరు ఉన్నట్టయితే గుర్తింపు కార్డు తెచ్చుకుని ఓటు వేయవచ్చన్నారు. ఈ ఏడాది మేనెలలో ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి 12, 13 తేదీలకు మాత్రమే డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చారని దొరబాబు తెలిపారు. 14వ తేదీన కూడా విధులు నిర్వహించినందున డ్యూటీ సర్టిఫికెట్ అందించాలని కోరారు.

### రాము మృతికి సంతాపం

అమలాపురంటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసి కార్మికవర్గాల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడిన ఘనత గళ్లా రాముకు దక్కుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం అమలాపురం తాపీపనివారల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాము సంతాప సభ నిర్వహించారు. కోటిపల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన సేవలను వక్తలు కొనియాడారు. రాము చిత్రపటానికి పూలమాలలువేసి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

**రాముకు ఘననివాళి:** టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేసిన గళ్లా రాము కుటుంబ సభ్యులను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదివారం పరామర్శించారు. రాము చిత్రపటానికి పూలమాలలవేసి నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ అధికారి జయ వెంకటలక్ష్మి-బాబ్జీ ఉన్నారు. ఇటీవల మృతి చెందిన బండారులంకకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బళ్ల వీర్రాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆనందరావు పరామర్శించి ఓదార్చారు. బళ్ల మహానంది పాల్గొన్నారు.

### మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ముమ్మిడివరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యానాం నుంచి నాన్‌డ్యూటీపెయిడ్ మద్యాన్ని తరలిస్తున్న అల్లవరానికి చెందిన పోతుల చందును ఐ.పోలవరం మండలం కొమరగిరి వద్ద అరెస్టుచేసినట్టు ముమ్మిడివరం ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. అతడి వద్ద నుంచి నాలుగు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

### ఉచిత మెగా వైద్య శిబిరం

అల్లవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం న్యాపతి సుబ్బారావు పంతులు జడ్పీ హైస్కూల్లో అమలాపురం స్కంధ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కొప్పిసేడి శ్రీహరి బృందం ఈసీజీ, రక్తపరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ కొప్పిసేడి శ్రీహరి, జనసేన నాయకుడు పిండి రాజాలను టీడీపీ, జనసేన నాయకులు సన్మానించారు. పిండి గణపయ్య, కటికిరెడ్డి బాబి, నల్లా రాము, పిండి సురేష్, పొచ్చనపెద్ది వెంకటేష్, గుర్రం లవకుమార్, గుర్రం శ్రీను, ఆచంట నాగరాజు, నార్ని అమ్మాజీ పాల్గొన్నారు.

### నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

అంతర్వేది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు విజయనగరానికి చెందిన తిరుమల ప్రసాద్-కృష్ణశాంతి దంపతులు రూ.50వేలు విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథికి అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అర్చకులు, అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అన్నదానం స్వామి, కంప్యూటర్ అసిస్టెంట్ నరసింహ పాల్గొన్నారు.

### సుగంధ ద్రవ్యాలతో మహాలింగార్చన



ఉప్పలగుప్తం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విలసవిల్లి బసవయ్య అగ్రహారంలో కార్తీక మాస దీక్షలో భాగంగా 30వ రోజైన ఆదివారం అమావాస్య సందర్భంగా సుగంధ ద్రవ్యాలతో మహా లింగార్చన నిర్వహించారు. 365 శివలింగాలతో జరిగిన పూజలో యాలకులు, లవంగాలు, కర్పూరం, మొగలిపువ్వులు, కొబ్బరి పూల దండలతో మహాశివునికి అర్చన చేశారు. మున్నంగి రామకృష్ణశర్మ సారథ్యంలో కిశోర్‌శర్మ బ్రహ్మత్వంలో పూజలు జరిగాయి.

### మహామృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం



అమలాపురం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమనసలోని శ్రీరాజరాజేశ్వరీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుకృతు మహా మృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు వెలవెలపల్లి వీర వెంకటసత్యనారాయణ శివాచార్య (శర్మ) ఆచార్య బ్రహ్మత్వంలో చంద్రమౌళి భాస్కరశివాచార్య, సోమసుందర దీక్షితులు, కలగ వెంకటసూర్యశ్రీనివాస్‌శర్మ, వెలవెలపల్లి తాతయ్య శాస్త్రి ఆధ్వర్యంలో అర్చకులు శైవాగమం ప్రకారం రుద్రాభిషేకం నిర్వహించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప-అనురాధ దంపతులతో పాటు మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయబాబు, లింగోలు పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్డీవో దంపంతుల పూజలు


అంతర్వేది ఆలయంలో కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవో దంపతులు శ్రీకర్-అఖిలకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అంతర్వేది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు పి.శ్రీకర్-అఖిల దంపతులు ఆదివారం విచ్చేశారు. వారికి అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో దర్శనం చేయించి వేద పండితులతో మహదాశీర్వచనం ఇప్పించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అర్చకులు, అధికారులు అందించారు. అనంతరం ఆర్డీవోలు కుటుంబ సభ్యులతో కలిసి పలు ఆలయాలను సందర్శించిన అనంతరం స్వామివారి నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.విజయసారథి, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

### బాలబాలాజీ సేవలో

మామిడికుదురు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని ఆదివారం రామచంద్రపురం, కొత్త పేట ఆర్డీవోలు పి.శ్రీకర్- అఖిల దంపతులు, వారి కుటుంబ సభ్యులు, దర్శించుకున్నారు. వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వారు ఆలయానికి విచ్చేయగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింప చేశారు. అనంతరం అర్చకులు వారికి వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

### వీరేశ్వరుని సేవలో అమలాపురం ఆర్డీవో

ఐ.పోలవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి దంపతులు ఆదివారం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజు, అర్చకుడు యనమండ్ర తేజ ఆధ్వర్యంలో ఆర్డీవో దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరేశ్వరునికి ఆర్డీవో దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్డీవో దంపతులకు ఆలయ సిబ్బంది స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి సత్కరించారు.

### మెట్టకుర్రులో మల్లాడి పర్యటన

యానాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యానాం మెట్టకుర్రు వార్డు పరిధిలోని ఆదిఆంధ్రపేటలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, రెవెన్యూశాఖ తహశీల్దార్ వెంకటేశ్వరరావుతో కలిసి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదివారం మెట్టకుర్రులో పర్యటించారు. స్థానిక గ్రామ ప్రతినిధులు, ప్రజలతో కలిసి వాటర్ ట్యాంకు వద్ద ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మల్లాడి సూచించారు.

### 10 నుంచి మెగా షాపింగ్ ఫెస్టివల్

యానాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పర్యాటకులను, కొనుగోలుదారులను ఆకర్షించేందుకు పుదుచ్చేరి పర్యాటక శాఖ డిసెంబరు 10నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మెగా షాపింగ్ ఫెస్టివల్ నిర్వహించనుంది. యానాంలో కూడా ఫెస్టివల్ నిర్వహించనున్నారు. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో స్థానిక సీగల్స్ రెస్టారెంట్ సమావేశపుహాలులో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం వర్తకసంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. డిసెంబరు 10నుంచి జనవరి నెలాఖరు వరకు యానాంలో వివిధ వ్యాపార సంస్థల్లో జరిగే కొనుగోళ్లపై రూ.10కోట్ల వరకు బహుమతులు లభించనున్నాయి. కార్లు, బైక్స్, గ్రైండర్లు తదితర వస్తువుల కొనుగోళ్లపై లక్షకుపైగా బహుమతులు ఉన్నాయి. వస్తువుల కొనుగోలు సమయంలో కూపన్లు ఇచ్చి, డ్రా తీసి బహుమతులు అందిస్తారు. వ్యాపార అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో యానాం వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, సీహెచ్ మధుసూదనరావు(మధు), గాజుల బ్రహ్మానందరావు(బాబీ), నాగబాబు, పరిపాలనాధికారి కార్యాలయ సూపరింటెండెంట్ కాళ్ల సత్యనారాయణ, సీగల్స్ మేనేజర్ మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు వంటల పోటీ


బహుమతులు అందజేస్తున్న రిటైర్డ్ తహశీల్దారు

అమలాపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఆధ్వర్యంలో 'హమారీ రసోయి-హమారీ జిమ్మేదారీ' అనే థీమ్‌తో అమలాపురం లయన్స్ క్లబ్‌హాలులో ఆదివారం మహిళలకు వంటల పోటీ నిర్వహించారు. ఆ ప్రాంగణమంతా ఘుమఘుమలతో నిండిపోయింది. న్యాయనిర్ణేతలుగా విశ్రాంత తహసీల్దారు ఎ.అప్పారావు, పంగం ప్రసాద్, డేగల వెంకట్ వ్యవహరించారు. వంటశాలలో ఎల్‌పీజీ భద్రత, వంటలనాణ్యత, ప్రదర్శన, శుభ్రత అనే అంశాలను పరిగణలోకి తీసుకుని విజేతలకు బహుమతులు అందజేశారు. కోనసీమ ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ ఆధ్వర్యంలో విజేతలకు ప్రత్యేక బహుమతులు అందించారు.

### ఇది సంతపేటా? మునకపేటా?


ముంపులో సంతపేట

కాట్రేనికోన, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాట్రేనికోనలో ఒకటో వార్డు ముంపునకు గురైంది. చిన్నపాటి వానకు సైతం ఈప్రాంతం ముంపు బారిన పడుతోంది. అసలు దీనిని సంతపేట అనాలా? ముంపుపేట అనాలా? అన్న సందిగ్ధంలో ఇక్కడి నివాసితులున్నారు. సరైన డ్రైనేజీ లేక ఈపరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి పరిస్థితి మాత్రం ఎప్పటిలాగే ఉంది. ప్రజాప్రతినిధుల హామీలు అమలుకు నోచుకోవడం లేదు. ప్రజల ఇబ్బందులు చూడలేక పంచాయతీ అధికారులు అప్పుడప్పుడు ఇంజన్ల సహాయంతో నీటిని తోడిస్తున్నారు.

# చురుగ్గా సీసీ రోడ్డు పనులు

మండపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేడపాడులో చేపట్టిన జాతీయ ఉపాధి హామీ పనుల్లో మూడు సీసీ రోడ్డు పనులను చేపట్టారు. వాటిలో రెండు రోడ్డు పనులు పూర్తి చేశామని సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ చెప్పారు. తమ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నిధులు మంజూరు చేయించారని ఆయన తెలిపారు. ఇప్పటికే గ్రామంలో రెండు సీసీ రోడ్లను పూర్తి చేశామని, మరో రోడ్డు పని ప్రారంభించి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.



జెడ్.మేడపాడు పంచాయతీలో నిర్మించిన సీసీ రోడ్డు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న భక్తులు. పక్క చిత్రంలో ఆలయంలో విశ్రాంత ఐపీఎస్ బ్రహ్మారెడ్డి పూజలు

# వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తడంతో రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.4,25,630 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. విశ్రాంత ఐపీఎస్ జి.బ్రహ్మారెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. క్షేత్రపాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా పలువురు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయంలో పలువురు మహిళలు దీపాలంకరణ చేశారు.

# భక్తి శ్రద్ధలతో లక్షతులసి పూజ



అలమూరు జనార్ధనస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు. పక్క చిత్రంలో చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో జరిగిన చండీహోమం

ఆలమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆలమూరు నవజనార్ధనస్వామి ఆలయంలో విఖనసస్వామికి లక్షతులసి పూజ వైభవంగా నిర్వహించారు. మండల వైఖనస సంఘం అధ్వర్యంలో ఆదివారం విఖనసస్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేకపూజలు అనంతరం వేదపండితుల అధ్వర్యంలో లక్షతులసి పూజ జరిపించారు. ఈపూజా కార్యక్రమాలను సంఘ నాయకులు ప్రభాకరాచార్యులు, భగవాన్, సింగు బాబు, కృష్ణ తదితరులు పర్యవేక్షించారు. అనంతరం వైఖనస సంఘం అధ్వర్యంలో కార్తీక సమారాధన ఘనంగా జరిగింది.

**భక్తి శ్రద్ధలతో చండీహోమం:** కార్తీక బహుళ అమావాస్య సందర్భంగా ఆదివారం చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయం వద్ద చండీ యాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహక కార్యదర్శి వుండవల్లి వీర్రాజు పర్యవేక్షణలో జరిగిన చండీహోమంను పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. కార్తీకమాస అమావాస్య పర్వదిన సందర్భంగా జరిగిన ఈకార్యక్రమంలో పాల్గొనడానికి భక్తులు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

# ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

రాయవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గ్రామంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని జరిపారు. గ్రామానికి చెందిన కడియాల వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తొలుత అయ్యప్పస్వామి విగ్రహాన్ని రథంపై ఉంచి పూజలు, హారతులు చేశారు. గ్రామానికి చెందిన పలువురు అయ్యప్పస్వాములు వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అయ్యప్పస్వామి భజనలతో గ్రామోత్సవం జరిపారు. అయ్యప్ప పాటలకు అనుగుణంగా వారు పేటతుళ్లి ఆడారు. అయ్యప్పస్వామి రథోత్సవం సందర్భంగా భక్తులు కొబ్బరి కాయలుకొట్టి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వెదురుపాకలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

# అగస్త్తేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరులోనున్న పార్వతీ సమేత అగస్త్తేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారి అభిషేకాన్ని జరిపారు. అర్చకుడు కొమాళ్ళపల్లి పవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం అభిషేకాన్ని చేశారు. ప్రతిఏటా కార్తీకమాసం పూర్తయిన ఆఖరి అమావాస్య రోజున స్వామి వారికి అమావాస్య అభిషేకాన్ని జరుపు తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



వల్లూరులో స్వామివారికి అభిషేకం చేస్తున్న దృశ్యం

# కార్తీక వనసమారాధనలో సందడి



మండపేటలో జరిగిన వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

మండపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాపువర్గీయుల వన సమారాధన ఆదివారం జరిపారు. ఏడిద రోడ్డులో శ్రీకృష్ణదేవరాయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. సంఘ నాయకులు ఎమ్మెల్సీతో పాటు పలువురు కాపు వర్గీయులను సన్మానించారు.

**రామచంద్రపురం(ద్రాక్షారామ):** కాపు వర్గీయులు విద్యావంతులు కావడం ద్వారా యువత ఉన్నత స్థానాలు సాధించవచ్చని ఎమ్మెల్సీ అన్నారు. ఆదివారం పట్టణంలో అరిగెల వీర రాఘవులు, కృష్ణవేణి కాపు కల్యాణ మండపంలో కాపు వర్గీయుల కార్తీక వనసమారాధన జరిగింది. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల కాపు నాయకులు, వర్గీయులు పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కాపుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. టీడీపీ నాయకులు రాయపు రెడ్డి రాజా, రేవు శ్రీను, అక్కల రిష్వంత్‌రాయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి తదితరులు మాట్లాడారు. ముందుగా ఉసిరి చెట్టు వద్ద అరిగెల నాగేశ్వరరావు దంపతులు పూజలు జరిపారు. కాపు సంఘం అధ్యక్షుడు నారపరెడ్డి బలరాం, కార్యవర్గం ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనసమారాధనలో వివిధ పార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. నాట్యాచారిణి శిరిగినీడి మాధవిదేవి బృందం, నాట్యాచార్యులు చెవ్వూరు తులసీరామ్ బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్తీక వనసమారాధనలో అధిక సంఖ్యలో కాపులు పాల్గొన్నారు.

## నవోదయ ఉచిత శిక్షణ తరగతులు

ఆత్రేయపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ర్యాలి గ్రామంలో నవోదయ విద్యార్థులకు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నారు. అనూష్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నవోదయ ఎంట్రన్స్‌కు వెళ్లే విద్యార్థులకు ఉచిత శిక్షణను మనస్తత్వవేత్త చింతా శ్యామ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. చిన్నారులకు రిసోర్స్‌పర్సన్స్ ఎంట్రన్స్ శిక్షణ అందించారు.

# వీడని ముసురు..రైతుకు గుబులు

**• ఈదురుగాలులకు నేలవాలుతున్న పంట పొలాలు • తల పట్టుకుంటున్న అన్నదాత**



రావులపాలెం మండలం ఈతకోటలో నేలకొరిగిన వరిపొలం. పక్క చిత్రంలో కె.గంగవరంలో ధాన్యం తరలిస్తున్న రైతులతో ఎంపీడీవో, తహశీల్దార్, ఏవో తదితరులు

రావులపాలెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలు లకు వరి పొలాలు నేలకొరుగుతున్నాయి. మండలంలో రెండు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో కోతకు చేరుకున్న పంట పొలాలు నేలకొరుగుతున్నాయి. పొలాల్లో వర్షపు నీరు చేరడంతో వర్షాలు తగ్గుముఖం పట్టినా వారం రోజుల వరకు పంటపొలాలు ఆరితే తప్ప కోసే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. యంత్రాలతో కోసిన ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు కూడా ఆరాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులంటున్నారు. తుఫాను కారణంగా అటు తొలకరి, ఇటు దాళ్వా దిగుబడులపై ప్రభావంపడి నష్టపోయే అవకాశాలున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కె.గంగవరం:** పెంగల్ తుపాను కారణంగా మండలంలో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. యంత్రాలతో పంటను ఒబ్బిడి చేసి వర్షంబారి నుంచి దాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలుపడ్డారు. ధాన్యం రాసులకు టార్పాలిన్‌లు కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. ధాన్యం రాశుల వద్దకు నీరు చేరకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సొసైటీల్లో అందిస్తున్న టార్పాలిన్‌లను ధాన్యం రాసులపై కప్పాలని వ్యవసాయ శాఖ మండల అధికారి బలుసు రవి, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసులు రైతులకు సూచించారు. రైతులకు ప్రతి సొసైటీలో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచామన్నారు. కోట, సుందరపల్లి గ్రామాల్లో వారు పర్యటించారు. మండలంలో మిల్లులకు తరలించాల్సిన ధాన్యం 8 వేలు క్లింటాళ్ల వరకు ఉంటుందని వీటిని భద్రపరచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



మోదుకూరు వద్ద పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

## సాగునీటి పైపులైన్ల పునర్నిర్మాణం

ఆలమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మోదుకూరు, ఏడిద పంట భూములకు వెళ్లే సాగునీటి పైపులైన్‌ను ఆదివారం పునర్నిర్మించారు. అవి పూర్తిగా చెడిపోవడంతో సాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. దీంతో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి అధ్వర్యంలో పాడైపోయిన పైపులైన్‌కు మరమ్మతులు చేయించి సాగునీరు సక్రమంగా జరిగేలా పునర్నిర్మించారు. పైపలైన్ నిర్మాణానికి అయిన ఖర్చును గోపాలస్వామి సమకూర్చినట్టు రైతులు తెలిపారు. కార్యక్రమంలో మోదుకూరు టీడీపీ గ్రామ అధ్యక్షుడు దానం నగేష్, ఇరిగేషన్ ఇబ్బంది నార్ని అచ్యుత్, పలువురు రైతులు పాల్గొన్నారు.



ఉత్తమసేవా అవార్డు అందుకుంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్

## ఏరియా ఆసుపత్రికి ఉత్తమ సేవా అవార్డు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి ఎయిడ్స్ రోగులకు చికిత్స, కౌన్సిలింగ్ ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రస్థాయి సేవా అవార్డు దక్కింది. ఆదివారం ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఎయిడ్స్ దినోత్సవంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టరు ఎ.శిరి నుంచి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ రాష్ట్ర ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు.

## అముజూరులో వనసమారాధన

కె.గంగవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అముజూరు గ్రామంలో ఆదివారం కార్తీక వనసమారాధన జరిపారు. స్థానిక కాకతీయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

## శివాలయాల్లో పూజలు

రావులపాలెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాసం చివరి రోజు ఆదివారంనాడు వేకువజాము నుంచే శివాలయాల్లో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, బిల్వార్చన తదితర పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరారు.



విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు అందిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌ల పంపిణీ

మండపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడిద జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆదివారం ప్రతిభ గల విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఏడిద రోడ్డులో షిర్డీసాయి ఆలయ వ్యవస్థాపకుడు జాస్తి శ్రీనివాసచౌదరి, విజయలక్ష్మి దంపతుల నుంచి ప్రతిభ గల 50 మంది విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని హెచ్‌ఎం ముంగర వెంకటరాజు అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ నూతిక రాజేష్, టీడీపీ ఏడిద అధ్యక్షుడు పి.వీర్రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం

అమలాపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమనసలోని శ్రీరాజరాజేశ్వరీ సమేత రామేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సుకృతు మహా మృత్యుంజయ పాశుపత రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు వెలవెలపల్లి వీరవెంకటసత్యనారాయణ శివాచార్య బ్రహ్మత్వంలో చంద్రమౌళి బాస్కరశివాచార్య, సోమసుందర దీక్షితులు, కలగ వెంకటసూర్యశ్రీనివాస్‌శర్మ, వెలవెలపల్లి తాతయ్య శాస్త్రి ఆధ్వర్యంలో అర్చకులు శైవాగమం ప్రకారం రుద్రాభిషేకం నిర్వహించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప-అనురాధ దంపతులతో పాటు మాజీ సర్పంచ్ నడింపల్లి ఉదయబాబు, లింగోలు పెదకాపు తదితరులతో పాటు భక్తులు పాల్గొన్నారు.



ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీ వద్ద ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ. పక్క చిత్రంలో ద్రాక్షరామలో వైద్య సిబ్బంది, విద్యార్థుల ర్యాలీ

# అవగాహనతో ఎయిడ్స్ నివారణ



రాయవరం మండలం మాచవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది. పక్క చిత్రంలో కపిలేశ్వరపురం మండలం అంగరలో ర్యాలీ జరుపుతున్న దృశ్యం

ఆలమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, కె.సాయికిషోర్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజా అక్కులు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల ర్యాలీ:** ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థుల అధ్వర్యంలో ర్యాలీ జరిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ వి.నరసింహస్వామి, అధ్యాపకులు బాలస్వామి, అశోక్‌బాబు, రాజా, తేజ, శేఖర్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**రామచంద్రపురం(ద్రాక్షారామ):** అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమవుతుందని డాక్టర్ సౌజన్య అన్నారు. ఆదివారం ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ జరిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా నివారణ మందులు వాడాలని, ఆసుపత్రిలో వాటిని ఉచితంగా అందజేస్తారని పారా మెడికల్ జిల్లా అధికారి మాదవరపు వెంకటేశ్వర్లు అన్నారు. ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి ఎయిడ్స్ అవగాహన ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఐటీసీఐసీటీసీ కౌన్సిలర్ శిరీష, విశ్రాంత డీపీఎంవోలు గొల్లపల్లి కృష్ణ, బి.రవీంద్ర, పీపీ యూనిట్ భగవాన్, ఎంపీహెచ్‌వో చిక్కాల సూర్యారావు, భారతి భవానీ, ఎన్‌జీవోలు, రామా ఆదిత్య నర్సింగ్, కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల విద్యార్థులు, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ప్రాణ ఆసుపత్రి, బీమాబాయి మహిళా మండలి న్యూట్రిషన్ ఫుడ్ అందచేశారు.

**రాయవరం:** ఎయిడ్స్ నిర్మూలన అవగాహనతో సాధ్యమని మాచవరం పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఎం.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో వైద్యుడు శ్రీనివాస్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**మండపేట:** ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.రాధాకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ, మానవహారం జరిపారు. ఐసీటీసీ కౌన్సిలర్ డి.నాగలక్ష్మి ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ర్యాలీ, మానవహారం జరిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది సతీష్, మాధురి, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, జిల్లా కోశాధికారి మట్టా వీరబాబు, మండల ప్రధాన కార్యదర్శి ఇరవాడ రవికుమార్, కోశాధికారి వానపల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

**కపిలేశ్వరపురం:** మండలంలోని అచ్యుతాపురం పీహెచ్‌సీలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరపకుండా ఆదివారం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఎయిడ్స్ రహిత సమాజం అందరి బాధ్యతగా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది దీనికి హాజరుకాకుండా నిర్లక్ష్యం వహించినట్టు సమాచారం. ఎయిడ్స్ దినోత్సవాన్ని పట్టించుకోకపోవడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన జరిపారు. ఎయిడ్స్ నివారణ, తీసుకోవల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఉద్యోగులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలురాయవరం మండలం మాచవరంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం మండలం ర్యాలిలో శివస్వాముల ఆధ్వర్యంలో అన్నసమారాధన

## అన్నసమారాధన

ఆత్రేయపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ఆదివారం శివమాల ధరించిన భక్తులు అన్నసమారాధన జరిపారు. శివగురుస్వామి నామాల ఏసు ప్రసాద్ ఆధ్వర్యంలో శివమాలధారులు భక్తులకు అన్నసమారాధన జరిపారు. తొలుత ఉసిరిచెట్టు వద్ద పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు.

## పీడిత ప్రజల హృదయాల్లో పరంజ్యోతికి సుస్థిరస్థానం

ద్రాక్షారామ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడిన దివంగత గుర్రాల పరంజ్యోతి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం అన్నారు. గుర్రాల పరంజ్యోతి 19వ వర్ధంతిని రామచంద్రపురం మండలం వీరేశగుళ్ల కాలనీలో పరంజ్యోతి స్మారక స్థూపం వద్ద జరిగింది. ముం దుగా పరంజ్యోతి చిత్రపటానికి పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం వర్ధంతి సభ జరగ్గా వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.గనిరాజు, సహాయ కార్యదర్శి బి.సిద్దూ, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు, పరంజ్యోతి కుటుంబీకులు దయామని, రాహుల్, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు, ప్రజలు

## శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

రాయవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని పిరమిడ్ మాస్టర్లు రవి, కుమారి పిలుపునిచ్చారు. ఆదివారం రాయవరం సత్య సాయి మందిరంలో 17వ ఉచిత ధ్యాన శిక్షణ నిర్వహించారు. పిరమిడ్ మాస్టర్లు మాట్లాడుతూ రోజూ రెండు నిమిషాలు ధ్యానం చేయడం ప్రారంభించి క్రమంగా దాని నిడివిని పెంచుకునేందుకు యత్నిం చాలన్నారు. ధ్యాన శిక్షణ ఇచ్చిన పిరమిడ్ మాస్టర్లు రవి, కుమారిని గజ్జరపు కాశివిశ్వనాథం, వెలగల ఫణికృష్ణా రెడ్డి చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమం లో కొవ్వూరి వెంకటరెడ్డి, సునీత దంపతులు, వెంకటేశ్వరరావు దంపతులు, పులుగుర్త, అర్తమూరు, సోమేశ్వరం, రాయవరం గ్రామానికి చెందిన ప్రజలు పాల్గొన్నారు.



శిక్షణ ఇచ్చిన గురువును సత్కరిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

## డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం కృషి

రావులపాలెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేతా శ్రీను, టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కాసా విజయసాగర్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి మానే గోవింద్, మండల అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు అన్నారు. రావులపాలెంలో వారు మాట్లాడుతూ యువతను నిర్వీర్యం చేస్తున్న గంజాయి, మత్తు పదార్థాలను కట్టడి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఈగల్ పేరిట టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## ఆర్డీవో దంపతుల పూజలు

అంతర్వేది, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు పి.శ్రీకర్-అఖిల దంపతులు ఆదివారం విచ్చేశారు. వారికి అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అంతరాలయంలో దర్శనం చేయించి వేద పండితులతో మహదాశీర్వచనం ఇప్పించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అర్చకులు, అధికారులు అందించారు. అనంతరం ఆర్డీవోలు కుటుంబ సభ్యులతో పలు ఆలయాలను సందర్శించిన అనంతరం స్వామివారి నిత్యాన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.విజయసారథి, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

**వీరేశ్వరుని సేవలో**

**ఐ.పోలవరం:** అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి దంపతులు ఆదివారం మురమళ్ల శ్రీ భద్రకాళీసమేతవీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజు, అర్చకుడు యనమండ్ర తేజ ఆధ్వర్యంలో ఆర్డీవో దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరేశ్వరునికి ఆర్డీవో దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్డీవో దంపతులకు ఆలయ సిబ్బంది స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి సత్కరించారు.